
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
సోమవారం, 18 మార్చి 2024



	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	24	36
భద్రాద్రి	22	36

రంజాన్‌మాసం



ఇఫ్తార్ (సా) : 6:25 (సోమవారం)
సహర్ (ఉ) : 4:53 (మంగళవారం)

గతంలో ఎన్నడూ లేని విధంగా ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పదవుల జోష్ కనిపిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లా నాయకులకు పదవుల్లో పెద్దపీట దక్కుతోంది. ఇప్పటికే రాష్ట్ర కేబినెట్‌లో డిప్యూటీ సీఎంగా భట్టి విక్రమార్క, మంత్రులుగా తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక పాత్ర పోషిస్తుండగా.. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కార్పొరేషన్ పదవుల్లోనూ జిల్లాకు అధిక ప్రాధాన్యత దక్కింది. జిల్లాకు చెందిన ముగ్గురు నేతలతోపాటు హైదరాబాదులో ఉంటున్న జిల్లావాసులు మరో ఇద్దరికి కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కడం విశేషం. లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రభుత్వం నియమించిన 37కార్పొరేషన్ పదవులు కాంగ్రెస్‌కు అదనపు బలగంలాగా మారాయి.



పొదెం వీరయ్య
అటవీ అభివృద్ధి



రాయల నాగేశ్వరరావు
గిడ్డంగుల సంస్థ



మువ్వా విజయ్‌బాబు
టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ

కాంగ్రెస్‌లో పదవుల జోష్

- ముగ్గురు ఉమ్మడి జిల్లా నేతలకు కార్పొరేషన్ పదవులు
- గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా రాయల నాగేశ్వరరావు
- టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్‌గా మువ్వా విజయ్‌బాబు
- అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పొదెం వీరయ్య
- జిల్లా మూలాలున్న మరో ఇద్దరికీ అవకాశం
- ఇప్పటికే రాష్ట్ర కేబినెట్‌లో జిల్లాకు అగ్రతాంబూలం

ఖమ్మం, మార్చి 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అయితే పదవులు దక్కని వారిలో కొంత నిరాశ కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల టికెట్లు దక్కనివారు చైర్మన్ పదవులపై ఆశలు పెంచుకున్నారు. కానీ కొందరికే అవకాశం దక్కడంతో మిగిలినవారు నిరాశకు లోనయ్యారు. వారంతా లోక్‌సభ ఎన్నికల తర్వాత చేపట్టే నియామకాల్లో తమకు అవకాశం దక్కుతుందన్న ఆశతో ఉన్నారు. కార్పొరేషన్ పదవుల్లో జిల్లాలో భట్టి, పొంగులేటి వర్గాలకు అవకాశం దక్కగా, తుమ్మల, రేణుకాచౌదరి వర్గీయులకు అవకాశం రాలేదు. దాంతో వారిలో కొంత నిరాశ కనిపిస్తోంది. భట్టి, పొంగులేటి వర్గంలో మరి కొందరు కూడా చైర్మన్ పదవులు ఆశించినా వారికీ నిరాశే ఎదురైంది. అయితే ఎవ్వరూ తమ అసంతృప్తిని బయటికి చెప్పకపోవడం గమనార్హం. గత అసెంబ్లీ ఎన్నికల్లో భద్రాచలంలో ఓడిపోయిన పొదెం వీరయ్య రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి దక్కింది. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌కు పదవి దక్కలేదు. అలాగే ఖమ్మం, వైరా, సత్తుపల్లి, కొత్తగూడెం, అశ్వారావుపేట, ఇల్లెందు, పినపాక, పాలేరు నియోజకవర్గాల్లో టికెట్లు ఆశించినవారికి చైర్మన్ పదవులు ఇస్తామని అధిష్ఠానం చెప్పినా వారికీ పదవులు దక్కలేదు. గత ప్రభుత్వంలో మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్‌గా ఉండి ఆ పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన వైరాకు చెందిన బొర్ర రాజశేఖర్‌కు పదవి లభించలేదు.

పదవులు దక్కిన నేతలు వీరే..

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా రాయల నాగేశ్వరరావుకు అవకాశం దక్కింది. పాలేరు నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో టికెట్ ఆశించిన రాయల కాంగ్రెస్‌లో చాలాకాలంగా క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. గత ఎన్నికల్లో పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాలేరులో పోటీ చేయడంతో ఆయనకు పోటీ చేసే అవకాశం దక్కలేదు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేషన్ పదవి ఇస్తామని హామీ ఇవ్వడంతో అసెంబ్లీ ఎన్నికల టికెట్ల పోటీ నుంచి తప్పుకున్నారు. అయితే ప్రస్తుతం ఆయన లోక్‌సభ టికెట్ ఆశిస్తుండగా గిడ్డంగుల సంస్థ చైర్మన్ పదవి లభించింది.

తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా మువ్వా విజయ్‌బాబు నియమితులయ్యారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడిగా ఉన్న విజయ్‌బాబు గతంలో ఖమ్మం డీసీసీబీ చైర్మన్‌గా పని చేశారు. ఆయన గత అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం కాంగ్రెస్ టికెట్ ఆశించారు. సత్తుపల్లికి చెందిన ఆయనకు తాజాగా కార్పొరేషన్ పదవి దక్కింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి లభించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన భద్రాచలం నుంచి పోటీ చేసి ఓడి పోయారు. ఆయన 2018లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచి కేసీఆర్ ఆకర్ష్‌కు లొంగకుండా పార్టీలో కొనసాగారు. దాంతో గత ఎన్నికల్లో ఓటమి చెందినా ఆయనకు చైర్మన్ పదవి లభించింది. వాస్తవానికి ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ఉంటే మంత్రి పదవి దక్కి ఉండేది.

వైరాకు చెందిన మరో ఇద్దరు

జిల్లా రాజకీయాల్లో క్రియాశీలంగా లేకపోయినా హైదరాబాద్ కేంద్రంగా సాగే రాజకీయాల్లో గత ఎన్నికల్లో టికెట్లు ఆశించిన మరో ఇద్దరు జిల్లా వాసులకు రాష్ట్ర కార్పొరేషన చైర్మన్ పదవులు లభించాయి. ఈ ఇద్దరికీ జిల్లా రాజకీయాలతో ప్రత్యక్ష సంబంధం లేకపోయినా హైదరాబాదులో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. వైరాకు చెందిన నూతి శ్రీకాంత్‌కు బీసీ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కగా ఆయనకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆశీస్సులతో ఈ పదవి దక్కినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక నాయుడు సత్యనారాయణకు హస్తకళా సంస్థ చైర్మన్ పదవి లభించింది. ఆయనకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆశీస్సులతో పదవి దక్కినట్లు తెలుస్తోంది. మొత్తం మీద ఉమ్మడి జిల్లాకు నియామక పదవుల్లో పెద్దపీటే దక్కిందని చెప్పవచ్చు. మిగిలిన కార్పొరేషన్ చైర్మన్ పదవులు లోక్‌సభ ఎన్నికల కోడ్ ఎత్తివేసిన తర్వాత నియామకం జరగనుంది. అప్పటి వరకు మిగిలిన ఆశావహులు ఎదురు చూడాల్సిందే.

లోక్‌సభ ఎన్నికలకు
పకడ్బందీ ఏర్పాట్లు

- రాజకీయ పార్టీలు ఎన్నికల కోడ్‌ను అనుసరించాలి
- సరిహద్దుల్లో పోలీస్ చెక్‌పోస్టుల ఏర్పాటు
- నగదు తీసుకెళ్లేవారు నిబంధనలు పాటించాలి
- అభ్యర్థుల ఖర్చు పరిమితి రూ.95 లక్షలు
- ఖమ్మం లోక్‌సభ ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



ఖమ్మం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం లోక్‌సభ పరిధిలో ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఖమ్మం లోక్‌సభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ సునిల్‌దత్ పేర్కొన్నారు. ఖమ్మం జడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం సంయుక్తంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించకూడదని తెలిపారు. మైనర్లను ఎన్నికల ప్రచారానికి వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల నిబంధనలను దృష్టిలో ఉంచుకొని నగదు తీసుకెళ్లేవారు నిబంధనలకు లోబడి రూ.50వేల లోపే తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు, నగదు పంపిణీ, ఘర్షణలు తలెత్తినప్పుడు సీ విజిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని, ప్రతి ఒక్కరు సీ-విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అంతేకాకుండా ఎన్నికలకు సంబధించి ఎలాంటి ఫిర్యాదులున్నా 1950 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

షెడ్యూల్ ప్రకారం మన రాష్ట్రంలో 4వ దశలో లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయని, ఏప్రిల్ 18నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ, 26న పరిశీలన, 29న తుది జాబితా, గుర్తుల కేటాయింపు ఉంటుదన్నారు. మే 13న పోలింగ్ జరుగుతుందని, జూన్ 4న ఖమ్మం రూరల్ మండలంలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కాలేజీలో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం కౌంటింగ్ ఉంటుందని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ తర్వాత ఈవీఎంలను కూడా అక్కడే భద్రపరుస్తామని వివరించారు. ఖమ్మం లోక్‌సభ రిటర్నింగ్ అధికారిగా తాను వ్యవహరిస్తారని, నామినేషన్ల స్వీకరణ ఖమ్మం కలెక్టరేట్‌లో ఉంటుందన్నారు. 9మందిని అసిస్టెంట్ పోలింగ్ రిటర్నింగ్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో మొత్తం 16,23,814 మంది ఓటర్లుండగా మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,896 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 10,500 మందిని ఎన్నికల విధులకు నియమించినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ సీసీ కెమేరాలు, వీడియో రికార్డింగు చేస్తామన్నారు. ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి ఊరేగింపులు, సభలు, సమావేశాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ వివరించారు.

ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థి రూ.95లక్షల వరకు ఖర్చు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. నామినేషన్ డిపాజిట్ కింద జనరల్ అభ్యర్థులు రూ.25 వేలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.12,500లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో ఇంకా ఓటరుగా చేరాలనుకునేవారు ఎన్నికల నోటిఫికేషన్ లోగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఖమ్మం సీపీ సునిల్‌దత్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర సరిహద్దులో ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో రెండు ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు, 10 ఇంటర్ స్టేట్ చెక్‌పోస్టులు, 8 ఇంటర్ డిస్ట్రిక్ చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 12 ఎఫ్ఎస్‌టీ, 15 ఎస్ఎస్‌టీ, 27 ఎంసీసీ టీంలు 141 మంది సెక్టార్ అధికారులను నియమించామన్నారు. రౌడీషీటర్లపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని తెలిపారు. మద్యం, డబ్బు పంపిణీ, ఓటర్లను ప్రలోభ పెట్టే వస్తువుల పంపిణీపై నిఘా పెట్టామని తెలిపారు. అలాగే సోషల్ మీడియాలో కులం మతం పేరుతో రెచ్చగొట్టే కథనాలు, పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి.మదుసూదన్ నాయక్, శిక్షణ, సహాయ కలెక్టర్లు మయాంక్‌సింగ్, యువరాజ్, ట్రైనీ ఐపీఎస్ మౌనిక, జడ్పీ సీఈవో వినోద్, డీపీఆర్వో ఎంఏ గౌస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రాజకీయ పార్టీలతో కూడా కలెక్టర్, సీపీ ఎన్నికల నియమావళిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పలు రాజకీయ పార్టీల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.



జూలూరుపాడు మండలం వెంగన్నపాలెంలో పరీక్షా కేంద్రంలో నెంబర్లు వేస్తున్న సిబ్బంది

పది పరీక్షలకు
సర్వం సిద్ధం

- నేటి నుంచి ఏప్రిల్ 1 వరకు నిర్వహణ
- ఖమ్మం జిల్లాలో 16,577, భద్రాద్రిలో 12,341మంది
- ఉదయం 9:30 పరీక్ష ప్రారంభం
- విద్యార్థులకు ఐదు నిమిషాల గ్రేస్ టైం అవకాశం
- పరీక్ష కేంద్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఖమ్మం ఖానాపురంహవేలి/కొత్తగూడెం(ఆంధ్రజ్యోతి), మార్చి17: పదో తరగతి వార్షికపరీక్షలు 18న ప్రారంభం కానున్నాయి. నేటినుంచి ఏప్రిల్ 1వరకు ఉదయం 9:30నుంచి మధ్యాహ్నం 12:30వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 16,577మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానుండగా వారిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 10,148మంది, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 6429మంది ఉన్నారు. వీరు కాకుండా ప్రైవేటుగా (ఒకసారి పరీక్ష తప్పిన వారు) 279మంది ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. జిల్లావ్యాప్తంగా 96 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు. పరీక్ష ప్రారంభమైన తరువాత 5 నిమిషాల వరకు విద్యార్థులను పరీక్షకు అనుమతించాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. కానీ విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు పరీక్షల ప్రారంభానికి ముందురోజే పరీక్షా కేంద్రాలను చూసుకోవాలని, తప్పనిసరిగా హాల్‌టికెట్లను తీసుకొని పరీక్షకు హాజరుకావాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమంతించబోమన్నారు. పరీక్షా సమయంలో పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన మందులతో వైద్య బృందాలను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థుల కోసం ఉదయం ఆర్టీసీ బస్సులు సిద్ధంగా ఉంటాయని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు అదనంగా ప్రత్యేక బస్సులను నడిపించాలని ఆర్టీసీ అధికారులను కోరామని తెలిపారు.

భద్రాద్రి జిల్లాలో 12,341మంది విద్యార్థులు

భద్రాద్రి జిల్లాలో పదో తరగతి పరీక్షలకు 12,341మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరికోసం మొత్తం 73పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డీఈవో వెంకటేశ్వరాచారి తెలిపారు. జిల్లాలో మొత్తం 303 పాఠశాలల నుంచి 5,900 మంది బాలురు, 6,441 మంది బాలికలు పరీక్షలకు హాజరుకానున్నారు. 667మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. మొత్తం 73పరీక్షా కేంద్రాలుంటే వాటిలో 70 రెగ్యులర్ పరీక్షా కేంద్రాలు, 3 ప్రైవేటు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలకు ఎలాంటి ఇబ్బంది కలిగినా వెంటనే జిల్లా విద్యాశాఖ ఏసీజీఈ మాధవరావు 8919279238, కంట్రోల్‌రూం నెం 9396654181కు సమాచారం అందించాలని డీఈవో సూచించారు. పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు కలెక్టర్ ప్రియాంక అల శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు.

చేపా.. చేపా.. చిక్కవా..!



కరకగూడెం మండలంలోని తాటిగూడెం పంచాయితీలోని ఊర చెరువులో జల పుష్పాలు విరబూశాయి. ఎర్రటి ఎండలో తళుక్కున మెరుస్తూ నీటిలో మునకలు వేస్తున్న చేపలను ఒడిసి పట్టేందుకు మత్స్యప్రియులు పోటీ పడ్డారు. మొప్పలు కదుపుతూ జర్రున జారుతూ వయ్యారాలు వలకబోసే నాటురకం చేపల కోసం గ్రామాల నుంచి తండోపతండాలుగా తరలారు. ఆదివారం తాటిగూడెం ఊర చెరువులో చేపలను పట్టేందుకు ప్రజలు గుంపులుగా వెళ్లారు. దీంతో గాలాలు, వలలతో ఆ ప్రాంతమంతా జల పుష్పాల జాతరలా కనిపించింది. - కరకగూడెం

వలస సాలసి ఇంటిబాట



మిర్చి కోత పనుల కోసం పొరుగు రాష్ట్రాల నుంచి భద్రాద్రి జిల్లాకు వచ్చిన వలస కూలీలు సీజన్ పూర్తికావడంతో తిరిగి తమ ఇంటిబాట పట్టారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన శ్రమజీవులు మిర్చి కోతలకు ఏటా భద్రాద్రి జిల్లాకు వస్తుంటారు. ఈ సంవత్సరం జూలూరుపాడు మండలానికి సుమారు ఐదు వేల మంది కూలీలు వచ్చారు. మూడు నెలలపాటు పొలాల్లోనే గుదారాలు వేసుకొని పనులను చేపట్టారు. మిర్చి కోతలు ఆఖరి దశకు చేరడంతో ఆదివారం చాలామంది ఇంటిబాట పట్టారు. - జూలూరుపాడు

మా ఊరిలో
మద్యం అమ్మొద్దు


- గుండాల మండలం సాయనపల్లి వాసుల తీర్మానం
- మద్య నిషేధంపై గ్రామంలో అవగాహన ర్యాలీ



మానవహారం నిర్వహిస్తున్న గ్రామస్థులు

గుండాల, మార్చి 17: కుటుంబాలను నాశనం చేస్తున్న మద్యం మహమ్మారిపై ఆ ఊరి ప్రజలు కన్నెర్రజేశారు. మత్తు భూతాన్ని తమ గ్రామ సరిహద్దులు దాటించేందుకు నడుం బిగించారు. తమ గ్రామంలో మద్యం అమ్మవద్దని, ఎవరైనా విక్రయిస్తే జరిమానా తప్పదని హెచ్చరిస్తూ గుండాల మండలం సాయనపల్లి పంచాయతీ ప్రజలు తీర్మానం చేశారు. ఈ క్రమంలో సాయనపల్లి గ్రామంలో ఆదివారం మహిళలు, యువత, గ్రామపెద్దల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. గత కొంత కాలంగా సాయనపల్లిలో బెల్ట్ షాప్‌ల ద్వారా మద్యం అమ్మకాలు ఎక్కువగా సాగుతుండడంతో మద్యం ప్రియులు, యువత మద్యానికి బానిసలై అనారోగ్యం పాలవుతున్నారు. దాంతో గ్రామస్థులంతా ఆదివారం సమావేశమై గ్రామంలో మద్యం నిషేదిస్తూ తీర్మానం చేశారు. అనంతరం గ్రామస్థులంతా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే మద్యానికి బానిసలై చెడిపోతున్నారని, దీంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. గ్రామంలో ఏ ఒక్కరు మద్యం అమ్మకాలు చేయవద్దని, ఎవరైనా విక్రయిస్తే వారికి జరిమానా విధిస్తామని తెలిపారు. ఈ విషయంలో పోలీసులు, మండలాధికారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నోరూరిస్తున్న రంజాన్ రుచులు..



- ఆహ్వానిస్తున్న సంప్రదాయ వంటకాలు
- హలీం, హరీస్ కోసం జనం క్యూ..
- రోజా ఉన్న వారికి బలవర్ధక ఆహారం
- తాత్కాలికంగా రంజాన్ రెస్టారెంట్లు

7

ఆర్టీసీ కార్మికులను
ఉద్యోగులుగా గుర్తించాలి



- బకాయిపడ్డ డీఏ విడుదల చేయాలి
- అపాయింట్‌మెంట్ తేదీని వెంటనే ప్రకటించాలి..
- ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు వీఎస్ బోస్
- ముగిసిన ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు

7

నవమి ఏర్పాట్లపై నేడు సమీక్ష

భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక అల

కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 17: భద్రాచలంలో ఏప్రిల్ 17న జరిగే శ్రీరామ నవమి, పట్టాభిషేకం ఏర్పాట్లపై కొత్తగూడెం కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రియాంక అలా సోమవారం మధ్యాహ్నం 2గంటలకు సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. ఇదిలాఉండగా సోమవారం కొత్తగూడెం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా యంత్రాంగం లోక్‌సభ ఎన్నికల విధుల నిర్వహణలో ఉన్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసేంతవరకు ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దుచేసినట్లు వివరించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు ప్రజావాణి రద్దు చేస్తున్నామని, ప్రజలు కలెక్టరేట్‌కు రావొద్దని పేర్కొన్నారు.

ముందుచూపు లేకనే తాగునీటి సమస్య

- వృథా నీటిని అరికట్టని అధికారులు
- భగీరథ పైప్‌లైన్ల లీకేజీలు
- రూ.229 కోట్లు వెచ్చించినా తాగునీటి ఎద్దడే
- మేల్కోనకపోతే సమస్య జటిలం



ఖమ్మంకార్పొరేషన్, మార్చి17: కేంద్రప్రభుత్వం అమృత్ పథకం కింద ఖమ్మం నగరపాలకసంస్థకు రూ.229కోట్లు కేటాయించింది. ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకానికి మళ్లించి, నగరపాలకసంస్థ పరిధిలో తాగునీటి సౌకర్యానికి వెచ్చించింది. అయితే ముందుచూపు లేకపోవటంతో మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీటిని ఇష్టారీతిగా వదిలారు. నిరంతరాయంగా సరఫరా చేయటంతో తాగునీరు వృథాగా పోయింది. అంతేకాకుండా పైప్‌లైన్ల లీకులతో లక్షలాది లీటర్ల తాగునీరు వృథా అయింది. ఫలితంగా ప్రస్తుతం నగరంలో తాగునీటిని రోజువిడిచి రోజు, కొన్ని ప్రాంతాల్లో రెండురోజులకు ఒకసారి సరఫరా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జీళ్లచెరువు ఫిల్టర్‌బెడ్‌నుంచి..

మిషన్ భగీరథ పథకం కింద కూసుమంచి మండలం జీళ్లచెరువు వద్ద భారీ ఫిల్టర్‌బెడ్‌ను నిర్మించారు. పాలేరు నుంచి నీళ్లను అక్కడికి తరలించి, శుద్ధి చేసిన అనంతరం ఖమ్మానికి సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా ఖమ్మం నగరపాలకసంస్థ పరిధిలో 28వాటర్ ట్యాంకులు నిర్మించి, సదరు మిషన్ భగీరథ నీళ్లను వాటర్ ట్యాంకులలోకి పంపి నగరవాసులకు సరఫరా చేయాల్సి ఉంది. అయితే పథకం అస్తవ్యస్తంగా సాగటంతో తాగునీరు ప్రజలకు అందటం కన్నా వృథానే ఎక్కువగా అయింది. రోజుకు 30మిలియన్ లీటర్ల తాగునీరు సరఫరా చేసినా, ఫలితం లేకుండా పోయింది.

ఆదినుంచి ఆటంకాలే..

నగరంలో మిషన్ భగీరథ ట్యాంకుల నిర్మాణంలో తీవ్ర జాప్యం ఏర్పడింది. దీంతో నేరుగా జీళ్లచెరువునుంచి వచ్చే తాగునీటిని ఖమ్మంలో సరఫరా చేయటం, ఆపుచేయటం లేకుండా పోయింది. అక్కడ నుంచి తాగునీటిని వదిలి, వారు నిలిపివేసినప్పుడే సరఫరా ఆగిపోయేది. దీంతో గంటల తరబడి నీళ్ల సరఫరా అయ్యి, వృథాగా పోయేవి. నగరంలో 680 కిలోమీటర్ల మేర తాగునీటి పైప్‌లైన్లు నిర్మించినా, నేరుగా ఎంతో వేగంగా (ఫోర్స్) జీళ్లచెరువు నుంచి తాగునీరు సరఫరా కావటంతో ఈ పైపులు తట్టుకోలేక ధ్వంసం అయ్యాయి. ఇక అసలు కాంట్రాక్టర్ కాకుండా సబ్‌కాంట్రాక్టర్ పనులు చేయటంతో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. పైప్‌లైన్లు నిర్మించేటప్పుడు గోతులు తవ్వి అలాగే వదిలేశారు. దీంతో పైప్‌లైన్లు దెబ్బతిన్నాయి. నేరుగా వచ్చే నీటితో వాల్వులు సైతం తట్టుకోలేక తరచూ లీకై నీళ్ల ఫౌంటెయిన్ మాదిరిగా గంటల తరబడి విరజిమ్మి వృథాగా పోయేవి. ఇలా పలుకారణాలతో లక్షలాది నీటర్ల నీరు వృథా అవటంతో ప్రస్తుతం తాగునీటి ఎద్దడి ఏర్పడింది.

నీరు వృథా కాకుండా చర్యలు

రంజిత్‌కుమార్, ఈఈ ప్రజారోగ్య శాఖ

మిషన్ భగీరథ ద్వారా వచ్చేనీరు వృథాకాకుండా చర్యలు తీసుకుంటున్నాం. పైప్‌లైన్లు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపడుతున్నాం. నీటిని సరఫరా చేయటం, ఆపుచేసేందుకు పైప్‌లైన్లలో ఇక్కడే ఏర్పాటు చేయటంతో, ఇక్కడనుండే నిర్ణీత సమయంలో తాగునీరు సరఫరా చేస్తున్నాం. ఫలితంగా నీరు వృథా కావటంలేదు.

సామాజిక ప్రయోజనమే కవిత్వ ధ్యేయం

● కవి, సాహితీవేత్త శ్రీనివాసాచార్య



భావనా ఝరి కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న కవులు

ఖమ్మం సాంస్కృతికం, మార్చి 17: సామాజిక ప్రయోజనమే కవిత్వ ధ్యేయమని ప్రముఖ కవి, సాహితీవేత్త దర్భశయనం శ్రీనివాసాచార్య అన్నారు. కవి పొత్తూరి సీతారామారావు రచించిన కవితా సంపుటి భావనా ఝరి ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఖమ్మంలో జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కవులు సామాజిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సాహిత్యాన్ని రచించాలన్నారు. సమకాలిన సమాజంలోని సమస్యల పరిష్కారం దిశగా కవిత్వ శరాలను ఎక్కుపెట్టాలన్నారు. పాలకుల పాలనా వైఫల్యాలను, లోపాలపై ప్రజలను చైతన్య పరచాల్సిన అవసరం ఉందన్నారు. సీనియర్ కవి పొత్తూరి సుబ్బారావు సాహిత్యవారసత్వాన్ని పునికి పుచ్చుకున్న సీతారామారావు సామాజిక సందేశాన్నిచ్చే కవిత్వం రాయటం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త మువ్వా శ్రీనివాసరావు, సీనియర్ కవి జీవన్, కన్నెగంటి వెంకటయ్య, షఫీ, తులసి రామానుజాచార్యులు, డాక్టర్ కొల్లు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వారిపై చర్యలు

● స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

సత్తుపల్లిరూరల్, మార్చి17: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలు పాటించని అభ్యర్థులు, పార్టీలపై చర్యలు తీసుకోనున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బీ.సత్యప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన సత్తుపల్లి మునిసిపాలిటీలో ఆకస్మికంగా పర్యటించారు. శనివారం ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే అమల్లోకి కోడ్ రావడంతో మునిసిపాలిటీతో పాటు మండలంలో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, బోర్డులను తొలగించడంతో విగ్రహాలపై ముసుగులు వేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను అతిక్రమించే అభ్యర్థులు, పార్టీలపై చర్యలు తీసుకునే హక్కు ఎన్నికల సంఘానికి ఉంటుందని, కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ప్రభుత్వాలు ఎలాంటి విధాన పరమైన నిర్ణయాలు తీసుకోవడానికి వీలుండదని, ప్రభుత్వాలు ప్రజాకర్షక పథకాలను ప్రకటించే అవకాశం కూడా లేదన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పట్టణంలోని ఆయా ప్రాంతాలలో పర్యటించి మునిసిపల్ కమిషనర్ మందా రవిబాబుకు పలు సూచనలు చేశారు.



పట్టణంలో భవనాలపై హోర్డింగులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

ఈత మిత్రుల ఆత్మీయ సమ్మేళనం

ఖమ్మం స్పోర్ట్స్, మార్చి 17: లెఫ్ట్ కెనాల్ సిమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో ఈత మిత్రుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా స్విమ్మర్లు నృత్యాలతో, ఆటపాటలతో అలరించారు. ఈత వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో లెఫ్ట్ కెనాల్ సిమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శాగంటి వెంకటేశ్వరరావు, సెక్రెటరీ బండి వెంకటేశ్వరరావు, గోపాలపురం వెంకటాచారి, సీనియర్ స్విమ్మర్లు వెగినాటి లక్ష్మయ్య, బోజెడ్ల ప్రభాకర్‌రావు, మండేపూడి సత్యనారాయణ, విజయ్‌చందర్, బారి శ్రీను, వాసిరెడ్డి మాధవరావు, కనకం జనార్ధన్, కమర్తపు గోపాలరావు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న స్విమ్మర్లు

మణుగూరు కోర్టు బార్
అసోసియేషన్ ఎన్నికలకు ఏర్పాట్లు

● నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

మణుగూరుటౌన్, మార్చి17: మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్‌కు సంబంధించి 2024-25 ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. బార్ అసోసియేషన్‌లో మొత్తం 45 మంది ఓటర్లు ఉన్నారు. సోమవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై ఈ నెల 20 నుంచి ముగిస్తుంది. 21న నామినేషన్ల స్క్రూటినితోపాటు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ప్రకటిస్తారు. 22న నామినేషన్ల విత్‌డ్రాలు, చివరిగా పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. 28న పోలింగ్, అదే రోజు సాయంత్రం కౌంటింగ్ ప్రక్రియను చేపట్టి ఫలితాలను వెల్లడించనున్నారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా న్యాయవాది వెంకటరత్నం, సహాయ ఎన్నికల అధికారిగా న్యాయవాది కేవీ మధుసూదన్‌లు వ్యవహరించనున్నారు.



మణుగూరు జేఎంఎఫ్‌సీ కోర్టు వద్ద ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

● తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి శరత్‌బాబు



సమావేశంలో ప్రసంగిస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి శరత్‌బాబు

కల్లూరు, మార్చి 17 సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా నెలకొన్న విశ్రాంత ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి శరత్‌బాబు, ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కళ్యాణపు కృష్ణయ్యలు కోరారు. కల్లూరులో ఆదివారం మండల విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో వారు ప్రసంగిస్తూ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఆదరణ చూపుతున్న ప్రభుత్వ పక్షాన నిలుస్తామన్నారు. గత ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యవైఖరి అవలంభించిదని విమర్శించారు. పెన్షనర్లకు ఈహెచ్‌ఎస్‌ను అన్ని కార్పొరేట్ ఆసుపత్రులలో అమలు చేయాలని, మినిమం పెన్షన్ రూ.30 వేలుగా అందించాలని కోరారు. ఇన్‌కం టాక్స్‌ను రద్దు చేయాలని, మెడికల్ అలవెన్స్‌ను కనీసం రూ.3 వేలు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. నాలుగు విడతలుగా డీఏలను వెంటనే మంజూరు చేయాలని, రవాణా రాయితిని కల్పించాలని వారు కోరారు. సమస్యల పరిష్కారంలో విశ్రాంత ఉద్యోగులు అందరు ఐకమత్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ విశ్రాంత ఉద్యోగులను సంఘం తరుపున పూలమాలలతో శాలువలు కప్పి సన్మానించారు.

అనంతరం ఈ సమావేశంలో మండల సంఘం అధ్యక్షుడు వేల్పుల కృష్ణయ్య, కార్యదర్శి కడియాల ఫ్రాన్సిస్, కోశాధికారి సముద్రాల పుల్లారావులు సంఘ కార్యకాలపాలపై సమగ్ర నివేదికలను, అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల ఇన్‌చార్జి చెంచురెడ్డి, కార్యవర్గ సభ్యులు హుస్సేన్‌బేగ్, మోసాన్న, ఉమామహేశ్వరరావు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

చెవిదిద్దులు కొనివ్వలేదని..

● భర్తపై టర్పంటాయిల్ పోసి నిప్పంటించిన భార్య

ఖమ్మం క్రైం, మార్చి17: చెవి దిద్దులు కొనలేదని భర్తపై టర్పంటాయిల్ పోసి భార్య నిప్పంటించిన సంఘటన శనివారం రాత్రి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నిజాంపేటకు చెందిన షేక్ యాకూబ్‌పాషా, సమీనా దంపతులు కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కాగా తనకు చెవి దిద్దులు కొనివ్వాలంటూ భర్తతో కొద్దిరోజులుగా గొడవపడుతుంది. ఈ విషయంపై శనివారం సాయంత్రం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తన వద్ద డబ్బులు లేవని కొనివ్వలేనని భర్త చెప్పడంతో, క్షణికావేశానికి గురైన ఆమె టర్పంటాయిల్‌పోసి భర్తకు నిప్పంటించింది. దీంతో గాయపడిన పాషా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయంపై బాధితుడు కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మణుగూరుటౌన్, మార్చి17: అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన బెస్తగూడెంలో జరిగింది. సీఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..మణుగూరు మండల పరిధిలోని తిర్లాపురం పంచాయతీ విజయనగరం బెస్తగూడెం గ్రామానికి చెందిన మునిగెల నరేష్(40) అతని భార్య వరలక్ష్మిలకు మధ్య కుటుంబ తగాలున్నాయి. దీంతో ఆమె ఆరు నెలలకు పైగా భర్తను వదిలి తల్లివద్ద ఉంటోంది. కాగా ఆదివారం మధ్యాహ్నం నరేష్ ఇంట్లో మృతి చెందినట్లు తెలిసింది. సీఐ సతీష్‌కుమార్ సంఘటన స్థలంలో మృతికి సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

వైరా, మార్చి 17: వైరాకు సమీపంలోని నల్లచెరువు పక్కనే ఉన్న పామాయిల్ తోట వద్ద విద్యుదాఘాతంతో శ్రీనివాసరెడ్డికు చెందిన పాడిగేదె మృతి చెందింది. గేదెపైన ప్రమాదవశాత్తు స్తంభం పైనుంచి కరెంట్ తీగె పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. పక్కనే ఉన్న రైతుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఈ పాడిగేదె విలువ రూ.1.20లక్షలుగా ఉందని రైతు శ్రీనివాసరెడ్డి కోరారు.



మృతి చెందిన పాడిగేదె

మట్టి తోలుతున్న వాహనాల పరారీ

దుమ్ముగూడెం మార్చి 17: దంతెనం గ్రామపంచాయతీ పరిధిలో గల వెంకట్రాంపురం సమీప ప్రభుత్వ భూమి నుంచి అక్రమంగా మట్టి తోలుతున్న ఐదు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్లను గిర్దావరు ఆదినారాయణ ఆదివారం పట్టుకున్నారు. కాగా తహసీల్దార్ అనుమతులున్నాయంటూ వాహనదారులు గిర్దావరుకు తెలిపారు. తహసీల్దార్‌తో చెప్పిస్తే వాహనాలను వదిలేస్తానని గిర్దావరు అనడంతో వాహనదారులు వెంటనే తహసీల్దార్‌కు ఫోన్ చేశారు. పట్టుకున్న వాహనాలన్నింటినీ తహసీల్దార్ వదిలేయమని చెప్పారంటూ గిర్దావరుకు వాళ్లు తెలిపారు. తనకు ఫోన్ చేసి చెబితే వదులుతానని గిర్దావరు వారికి సమాధానమిచ్చారు. ఈ తతంగం జరుగుతుండగానే, వాహనాలన్నీ అక్కడి నుంచి పరారయ్యాయి. ఈ విషయమై తహసీల్దార్‌కు గిర్దావరు సమాచారమిచ్చారు. ప్రాపర్ చానల్ ద్వారా ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తానని సీఐ అధికారులకు తెలిపారు. ఈ విషయమై సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు గిర్దావర్ తెలిపారు.

దారి వివాదంలో ఇరు వర్గాలపై కేసు


బోనకల్, మార్చి 17: మండలంలోని మోటమర్రి గ్రామంలో దారి వివాదంలో ఇరు వర్గాలు దాడులు చేసుకోవడంతో ఐదుగురిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుబాబు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుర్రి రమేష్ ఇంటి ఎదురుగా ఉన్న దారికి వీదిపోటు పడుతుందన్న కారణంతో ప్రహరి నిర్మించడం పట్ల వివాదం నెలకొంది. గ్రామస్థులు ఇట్టి విషయంపై కలెక్టర్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గ్రామానికి శనివారం తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీవో శాస్త్రీ, గిర్దావర్ లక్ష్మణ్, పోలీస్ సిబ్బంది వెళ్లారు. దారి వివాదం గురించి మాట్లాడుతుండగా ఇరు వర్గాల వారు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కోడిపందేల స్థావరాలపై దాడి

● రూ.3,900నగదు, ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

పెనుబల్లి, మార్చి 17: మండలంలోని కర్రాలపాడు శివారులో కోడిపందేల స్థావరాలపై వీఎంబంజర్ ఎస్ఐ వెంకటేష్ ఆదివారం దాడులు నిర్వహించారు. కోడిపందేలు నిర్వహిస్తున్న 11మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.3,900నగదు, రెండు కోడికత్తులు, ఏడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



సమీర్

సత్తుపల్లిరూరల్, మార్చి17: ఆత్మహత్య చేసుకున్న యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆదివారం ఎన్టీఆర్ నగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లిలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన మహ్మద్ బషీర్ కుమారుడు సమీర్ (22) పట్టణంలోని ఓ టైల్స్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ఆత్మహత్యకు పాల్పడగా, గమనించిన కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కాగా ఆత్మహత్యకు కారణంగా ప్రేమ వ్యవహరమేనని సమాచారం. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇల్లెందులో దివ్యాంగుడు ..

ఇల్లెందుటౌన్, మార్చి 17: ఓ దివ్యాంగుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి ఇల్లెందు పట్టణంలో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కాకతీయనగర్‌లో నివాసం ఉంటున్న బియాని సురేందర్(27) అతని స్వగ్రామమైన మండల పరిధిలోని రాగబోయినగూడెం గ్రామానికి ఆదివారం ఉదయం వెళ్లాడు. సొంత ఇంటికి వెళ్లిన సురేందర్ అక్కడ నుంచి ఆరవమైలు సమీపంలోకి వెళ్లి రహదారికి అతిసమీపంలో పురుగుల మందు సేవించి పడిపోయాడు. ఈ విషయాన్ని రహదారి వెంట వెళ్తున్నావారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోని పరిశీలించగా, అప్పటికే మృతి చెందినట్టుగా గుర్తించారు. ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దివ్యాంగుడు ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

వాహనాల తనిఖీలను పకడ్బందీగా నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



సరిహద్దు చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న జేసీ మధుసూదన్ నాయక్

బోనకల్, మార్చి 17: సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్డీవో గణేష్‌లు అన్నారు. బోనకల్ వద్ద ఏర్పాటు చేసిన అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును ఆదివారం వారు తనిఖీ చేశారు. వాహనాల తనిఖీకి సంబంధించి పలు సూచనలు చేశారు. పోలీసులు, అధికారులు ఎన్నికల నిబంధనల మేరకు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. వాహనాల తనిఖీ సమయంలో రేడియం జాకెట్లను విధిగా ధరించాలని, బారికేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాల తనిఖీల వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పున్నమ్ చందర్, ఎస్ఐ మధుబాబు, గిర్దావర్ లక్ష్మణ్, కార్యదర్శులు కిరణ్, అశోక్ పాల్గొన్నారు.

పెనుబల్లి: మండలంలోని ఆంధ్రా-తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులోని ముత్తగూడెంలో వీఎంబంజర్ పోలీసుల ఆధ్వర్యంలో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టు వద్ద 24గంటలు దశలవారీగా పోలీసు, రెవెన్యూ ఇతరశాఖల అధికారులతో టీంలను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

ఎర్రుపాలెం: మండలంలోని తెలంగాణ ఆంధ్ర రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులను ఆర్డీవో గణేష్ ఆదివారం తనిఖీ చేశారు. దేశ వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద పోలీసుల నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ భారీగా డబ్బు, మద్యం రవాణా జరిగే అవకాశం ఉందని, రెవెన్యూ అధికారులు, పోలీసులు శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రజలు ప్రయాణ సమయంలో రూ.50 వేలకు మించి నగదుతో ప్రయాణించే సందర్భంలో అధికారులకు సంబంధిత ధ్రువపత్రాలు చూపించాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు. ఈ తనిఖీలో తహసీల్దార్, మన్నె ఉషాశారద, ఎస్ఐ వెంకటేష్, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న ఆర్డీవో గణేష్

అలరించిన
'స్వప్నం రాల్చిన అమృతం' నాటిక

ఖమ్మం సాంస్కృతికం, మార్చి 17: నెలనెల వెన్నెల సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం భక్తరామదాసు కళాక్షేత్రంలో ప్రదర్శించిన స్వప్నం రాల్చిన అమృతం నాటిక రంగస్థల అభిమాన ప్రేక్షకులను అలరించింది. నటీనటులు తమ హావభావాలతో నటనా పటిమతో ఆకట్టుకున్నారు. చైతన్య భారతి కరీంనగర్ కళాకారులు ప్రదర్శించిన ఈనాటికకు మంచాల రమేష్ దర్శకత్వం వహించగా పీఎస్ నారాయణ మూల కథ అందించారు. కార్యక్రమాన్ని నెలనెల వెన్నెల నిర్వాహకులు ఏఎస్ కుమార్, మోటమర్రి జగన్మోహన్ రావు పర్యవేక్షించారు.



స్వప్నం రాల్చిన అమృతం నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

రూ.1.20 లక్షల మద్యం పట్టివేత

● వ్యక్తిపై కేసు నమోదు



పోలీసులు సీజ్ చేసిన మద్యం

జూలూరుపాడు, మార్చి17: మండలంలోని పాపకొల్లు గ్రామంలో ఓ వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని పట్టుకొని సీజ్ చేసినట్లు జూలూరుపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి జూలూరుపాడులోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. నమ్మ దగిన సమాచారం మేరకు పాపకొల్లు గ్రామంలోని గుమ్మడి వెంకటేశ్వర్లు ఇంట్లో ఎస్ఐ జీవన్‌రాజు, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించగా అక్రమంగా నిల్వ చేసిన మద్యం సీసాలు పట్టుబడ్డాయని తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించి సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గ్రామాలలో ఎవరైనా వ్యక్తులు మద్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం విలువ రూ.1.20లక్షలు ఉంటుం దని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ ఇరుగు జీవన్‌రాజు పాల్గొన్నారు.

నీటి కోసం విద్యార్థుల అవస్థలు

● సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రుల వినతి

మధిరరూరల్, మార్చి 17: మధిర మండలం కృష్ణాపురం వద్దగల మహాత్మా జ్యోతిరావ్‌పూలే ప్రభుత్వ బాలుర గురుకుల పాఠశాలలో నీటి కోసం విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పాఠశాలలో ఉన్న మోటార్ రెండు రోజుల నుంచి పనిచేయడం లేదు. దీంతో విద్యార్థులు స్నానాలకు ఇతర అవసరాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమీప గ్రామమైన సిరిపురం నుంచి ట్యాంకర్ ద్వారా నీరు తెప్పించినప్పటికీ విద్యార్థులకు సరిపోకపోవడంతో అగచాట్లు పడుతూ నడుచుకుంటూ వెళ్లి బకెట్లతో స్థానిక గురుకుల జూనియర్ కాలేజీ వద్ద నుంచి తీసుకువచ్చుకుంటున్నారు. నీళ్ల లేకపోవడంతో సమయం ఎక్కువ వృథా అవ్వడంతోపాటు సమయానికి స్నానాలు, టిఫెన్లు, భోజనాలు వంటివి చేయలేకపోతున్నామని వాపోతున్నారు. ఈ క్రమంలో పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్న యశ్వంత్ నీటి కోసం వెళ్తుండగా స్వల్ప అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఆ విద్యార్థిని సమీప ఆస్పత్రికి తరలించారు. తక్షణమే గురుకుల పాఠశాలలోని మోటారును రిపేర్ చేయించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ నీటి సమస్య, విద్యార్థుల ఇబ్బందులపై ప్రిన్సిపాల్ యాకూబ్‌ను వివరణ కోరగా పాఠశాలలో రెండు రోజుల క్రితం మోటారు మరమ్మతులకు గురైతే బాగు చేయించామని, కొంత సేపటి తర్వాత మరలా మరమ్మతుకు గురి అయ్యిందని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో నీటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ట్యాంకర్లతో నీళ్ల తెప్పిస్తున్నామన్నారు. కొంతమంది విద్యార్థులు ఆదివారం ఉదయం నీటి కోసం పక్కనున్న జూనియర్ కళాశాల వద్దకు వెళ్తే కూడా వద్దని వారించామన్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థి గతం నుంచే చిన్న అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడని తెలిపారు. తమ పాఠశాల సిబ్బంది ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించామన్నారు. వారి తల్లిదండ్రులను కూడా పిలిపించటం జరిగిందన్నారు.



బకెట్లలో నీళ్ల తెచ్చుకునేందుకు వెళ్తున్న గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు

సత్తుపల్లిలో చోరీ

సత్తుపల్లిరూరల్, మార్చి17: సత్తుపల్లిలోని యమహా షోరూం (లక్ష్మీ ఫైనాన్స్ ఆఫీస్)లో శనివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు షోరూమ్ లాకర్ పగులగొట్టి అందులో ఉన్న రూ.40వేల నగదును, కొన్ని వాహన పత్రాలు, ఆర్సీ కార్డులను చోరీచేశారని బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత



బాధితుడికి ఫోన్ అప్పగిస్తున్న సీఐ అశోక్‌రెడ్డి

అశ్వాపురం మార్చి 17: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఆదివారం అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో బాధితుడికి తిరిగి అప్పగించారు. వివరాల ప్రకారం.. అశ్వాపురానికి చెందిన గురజాల శ్రీను తన మొబైల్‌ను ఎక్కడో పోగొట్టుకున్నాడు. దీంతో అశ్వాపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్‌లో పోలీసులు బాధితుడి వివరాలు నమోదు చేసి, తాజా టెక్నాలజీ ద్వారా ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అందజేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా ఫోన్ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా వివరాలను సీఈఐఆర్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. తద్వారా ఫోన్‌ను పొందే అవకాశం ఉందని దీనిని సద్వినియోగపర్చుకోవాలన్నారు. ఎవరికైనా మొబైల్ ఫోన్‌లు, అనుమానిత వస్తువులు, విలువైన వస్తువులు దొరికితే స్థానిక పోలీస్‌స్టేషన్‌లలో అప్పగించాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ మురళీ పాల్గొన్నారు.

ముదిగొండలో
కోతుల స్వైరవిహారం



దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న వైస్‌ఎంపీపీ దామోదర్

ముదిగొండ, మార్చి 17: ముదిగొండలో ఆదివారం కోతులు బీభత్సం సృష్టించాయి. పలు ఇళ్లల్లోని రేకులు పగలగొట్టాయి. గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా ఉందని, కోతుల బారీనపడి చాలామంది గాయపడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. కోతులను నివారించాలని పంచాయతీ అధికారులకు ఎన్నిమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామానికి చెందిన మదార్‌బీ ఇంటిపై కోతులు స్వైరవిహారం చేయడంతో పైకప్పున ఉన్న రేకులు మొత్తం పగిలిపోయి కిందపడ్డాయి. దెబ్బతిన్న ఇంటిని వైస్ ఎంపీపీ మంకెన దామోదర్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు వీఎస్ బోస్

ఆర్టీసీ కార్మికులను ఉద్యోగులుగా గుర్తించాలి

- బకాయిపడ్డ డీఏ విడుదల చేయాలి
- అపాయింట్‌మెంట్ తేదీని వెంటనే ప్రకటించాలి..
- ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు వీఎస్ బోస్
- ముగిసిన ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు

ఖమ్మం ఖానాపురం హవేలి, మార్చి 17: కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్టీసీ కార్మికులు దన్నుగా నిలిచారని, మూడు నెలల్లో 22 కోట్ల మందిని గమ్య స్థానాలకు చేర్చారని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు వీఎస్ బోస్ తెలిపారు. ప్రభుత్వానికి దన్నుగా నిలిచిన కార్మికుల పట్ల ఫిట్మెంట్, బకాయిపడ్డ డీఏ చెల్లింపులలో వివక్ష తగదని ఆయన అన్నారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభల ముగింపులో భాగంగా ఆదివారం ఎస్. బాబు అధ్యక్షతన జరిగిన మహాసభలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులను కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ అపాయింట్మెంట్ డేట్ ఫిక్స్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 30 శాతం ఫిట్మెంట్ ఇచ్చిన ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు కేవలం 21 శాతం ఫిట్మెంట్ ఇవ్వడం శోచనీయమన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్టీసీ కార్మికులకు ఫిట్మెంట్ ఇవ్వాలన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన తర్వాత కార్మికులకు పని భారం విపరీతంగా పెరిగిందన్నారు. సిబ్బంది, బస్సులను పెంచకుండానే ప్రయాణికుల సంఖ్య రెండు రెండు పెరిగిందని, ఇది కార్మికుల పట్ల శాపంగా మారిందన్నారు. ఓవర్ లోడ్‌తో పాటు సమయపాలన లోపించిందని అన్నారు. ఏ రంగంలోనైనా పోరాడేది.. కార్మికులకు అండగా నిలిచేది ఏఐటీయూసీ అనుబంధ సంఘాలేనని అన్నారు. సింగరేణి, ఆర్టీసీ, బ్యాంకింగ్, బీఎస్ఎన్ఎల్ సహా ప్రభుత్వ రంగ సంస్థల్లో ఏఐటీయూసీ పోరాటాలు చారిత్రాత్మకమన్నారు.

కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని అన్నారు. కార్మిక పోరాటాలకు తలొగ్గి చట్ట అమలును తాత్కాలికంగా వాయిదా వేసిందే కానీ.. లేకపోతే భారతీయ న్యాయ సంహిత చట్టం డ్రైవర్ల పాలిట శాపంగా మారేదని అన్నారు.

మహాసభలలో 21 తీర్మానాలపై ప్రతినిధులు చర్చించి ఆమోదించారు. తీర్మానాల అమలుకు సంబంధించి తొలుత ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని పరిష్కారం కాని పక్షంలో ఆందోళన బాట పట్టాలని తీర్మానించారు. రెండో రోజు మహాసభలలో యూనియన్ సీనియర్ నాయకుడు కె. పద్మాకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, ఏఐటీయూసీ నాయకుడు నర్సింహ, ఏఐటీయూసీ నాయకులు ఈదురు వెంకన్న, పాటి అప్పారావు, తోట రామాంజనేయులు, జే. రాఘవులు, జీడీ ప్రసాద్, తిమ్మినేని రామారావు, కె. భాస్కర్, పిల్లి రమేష్, వెంకటరెడ్డి, అరుణ పాల్గొన్నారు.

ముగిసిన మహాసభలు..

రెండు రోజుల పాటు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగిన ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ మూడో రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి.

రాష్ట్ర నలు మూలల నుంచి యూనియన్ కు ప్రాతినిధ్యం వహిస్తున్న 250 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో 95 డిపోలకు ప్రాతినిధ్యం వహిస్తూ ప్రతినిధులు పాల్గొన్నారు. మహాసభలలో చర్చల్లోను మహిళా కార్మికులు పాల్గొని తమ సమస్యలను సంఘం దృష్టికి తీసుకు రావడంలోను, తీర్మానాల విషయంలోను ముందు వరుసలో నిలిచారు. ఆహ్వాన సంఘానికి, ఏఐటియునికి కార్మిక ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



ఈయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా బాబు, వెంకన్న

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్. బాబు, ఈదురు వెంకన్న ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా కె. పద్మాకర్, అధ్యక్షుడిగా ఎస్. బాబు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎండి అహ్మద్ అలీ, ఉపాధ్యక్షుడిగా ఎం. వెంకట్ గౌడ్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఈదరు వెంకన్న, ఉప ప్రధాన కార్యదర్శులుగా పాటి అప్పారావు, జే. రాఘవులు, ప్రచార కార్యదర్శిగా సి. శంకర్, కోశాధికారిగా జీడీ ప్రసాద్ ఎన్నికయ్యారు. మొత్తం 36 మందితో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వహణ సమితిని ఎన్నుకున్నారు.



హలీం కొనుగోలు చేస్తున్న నగరవాసులు

- నోరూరిస్తున్న సంప్రదాయ వంటకాలు
- హలీం, హరీస్ కోసం జనం క్యూ..
- రోజా ఉన్న వారికి బలవర్ధక ఆహారం
- తాత్కాలికంగా రంజాన్ రెస్టారెంట్లు

నోరూరిస్తున్న రంజాన్ రుచులు..

ఖమ్మం సాంస్కృతికం, మార్చి 17: రమదాన్ మాసమంటే పవిత్ర ప్రార్థనలు, ఉపవాస దీక్షలే కాదు.. నోరూరించే రుచులు కూడా.. రంజాన్ నెల ఆరంభం కావటంతో సంప్రదాయ మత ఆచారాలతోపాటు ప్రత్యేకత కలిగి ఉన్న ఆహారాలు అందుబాటులోకి వచ్చాయి. రోజంతా నియమనిష్టలతో కూడిన కఠిన ఉపవాస దీక్షలు వహించే విశ్వాసులకు బలవర్ధక ఆహారం అందించేందుకు ఆయా పదార్థాలను తయారు చేస్తున్నారు. రుచుల్లో విభిన్నత, ప్రత్యేకత కలిగిఉన్న వంటకాలు ముస్లింలతో పాటు అన్ని వర్గాలను ఆహ్వానిస్తున్నాయి. రంజాన్ వంటకాల పట్ల ఇతర మతాల వారు సైతం మక్కువ చూపుతుండటంతో వీటి విక్రయాలు ఏటేటా అమితాదరణకు నోచుకుంటున్నాయి. దీంతో రోడ్ల వెంట అధిక సంఖ్యలో తాత్కాలిక రంజాన్ రెస్టారెంట్లు ఏర్పాటవుతున్నాయి.

రంజాన్ రుచుల్లో ప్రధానమైనవి హలీం, హరీస్, గోధుమ, చికెన్, మటన్, మరికొన్ని డ్రైఫ్రూట్స్ బలవర్ధక మిశ్రమాలతో ఈ ప్రత్యేక వంటకాలను తయారు చేస్తారు. రుచుల్లో ప్రత్యేకతతోపాటు హలీం, హరీస్ తయారీ సైతం ప్రత్యేకతను కలిగి ఉంటుంది. వీటిని రూపొందించే పొయ్యిలు కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కలియబెడుతూ ఈ వంటకాలను తయారు చేస్తారు. ఈ ప్రధానమైన వంటలతోపాటు కద్దూఖీర్, రుమాల్ రోటీ, తదితర స్వీట్ల విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. నగరంలోని ప్రధాన రోడ్ల వెంట వెలుస్తున్న ఈతరహా రెస్టారెంట్లు అందరినీ ఆకర్షిస్తున్నాయి. మరో వంక ఖర్జూర, ఖర్బూజా, పుచ్చ, ఫలాతోపాటు బాదం, కిస్‌మిస్ తదితర డ్రైఫ్రూట్స్ విక్రయాల దుకాణాలు సైతం వినియోగదారులకు అందుబాటులోకి వచ్చాయి.



రుమాల్ రోటీ తయారీ..

ప్రజావాణి తాత్కాలికంగా రద్దు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 17: లోక్ సభ సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదల నేపథ్యంలో ఎన్నికల విధుల్లో జిల్లా అధికారులు, సిబ్బంది నిమగ్నమైనందున ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఖమ్మం జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు నిర్వహణలో భాగంగా ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేశామని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్‌జేసీ సెట్ గడువు పెంపు

ఏన్కూరు, మార్చి 17: తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ సొసైటీ ఆధ్వర్యంలోని గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం నిర్వహించే టీఎస్ఆర్‌జేసీ సెట్ 2024 గడువును ఈనెల 31వరకు పొడిగించినట్లు ఏన్కూరు గురుకుల ప్రిన్సిపాల్ తూడి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు.

చేయి చేయి కలిపారు..

నిఘా కోసం స్వచ్ఛందంగా సీసీ కెమెరాల ఏర్పాటు

- నిర్వహణకు రిజర్వ్ ఫండ్ కూడా..
- దొంగల భయంతో వినూత్న ప్రయత్నం

ఖమ్మంకార్పొరేషన్, మార్చి17: దొంగతనాలు ఎక్కువగా జరగటం, రాత్రివేళ మహిళలు ఒంటరిగా రావాలంటేనే భయపడే పరిస్థితిని గమనించి ఆ ప్రాంత కాలనీవాసులు చేయి చేయి కలిపారు.. విరాళాలు సేకరించారు.. చిన్న కాలనీలో ఏకంగా 38 సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో సదరు కాలనీవాసులు నిర్భయంగా తిరిగే పరిస్థితి ఏర్పడింది. నగరంలోని 16వ డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ రోడ్‌నెంబర్ 14లో గత ఏడాదినుంచి వరుసగా దొంగతనాలు జరుగుతున్నాయి. రాత్రి 9గంటల సమయంలోనే మహిళలు ఒంటరిగా రావాలంటే భయపడే పరిస్థితి. దీనిపై ఫిర్యాదులు చేసినా పట్టించుకొనే పరిస్థితి లేదు. ఈ క్రమంలో కాలనీవాసులు సమావేశమై మనకుమనమే మన కాలనీకి రక్షణ కల్పించుకుందామని తీర్మానించారు. 24మందితో ఒక కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షుడిగా యలమందయ్య, ప్రధాన కార్యదర్శిగా శ్రీహరి, కోశాధికారిగా సురేష్, ఆడిటర్‌గా శ్రీనివాసరావు, సలహాదారులుగా రామమూర్తి, సతీష్ ధావన్, ఇంకా 18మంది కమిటీసభ్యులను ఎన్నుకున్నారు. ప్రతి ఇంటి నుంచి స్వచ్ఛందంగా ఆర్థిక సహకారం అందించారు. శ్రీరామ్‌నగర్ కాలనీలో రోడ్‌నెంబర్ 13నుంచి 14వైపు వెళ్లే అన్ని బజారులు, రోడ్‌నెంబరు 14లో పూర్తిగా మొత్తం 38 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు. కెమెరాల నిర్వహణకు రిజర్వ్ ఫండ్ ఉంచుకున్నారు. కాలనీవాసుల అంకితభావానికి అందరూ అభినందిస్తున్నారు. చిన్నకాలనీలో 38 సీసీ కెమేరాలు ఏర్పాటు చేయటం పట్ల ప్రశంసిస్తున్నారు.



సీసీ కెమెరా అమర్చుతున్న దృశ్యం

ఉర్దుఘర్ యాజమాన్య కమిటీ అధ్యక్షుడిగా నయింఖురేషి

కొత్తగూడెం టౌన్, మార్చి 17: కొత్తగూడెం ఉర్దుఘర్ యాజమాన్య కమిటీ అధ్యక్షుడిగా ప్రముఖ వ్యాపారి నయీంఖురేషిని నియమించినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా తెలిపారు. ఆదివారం ఉర్దుఘర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం పట్టణంలో ఉన్న ఉర్దుఘర్‌ను మరింత అభివృద్ధిపథంలో నడిపేందుకు కృషి చేయాలన్నారు. గత పాలకులు ఉర్దుఘర్‌ను అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ఉర్దుఘర్ అభివృద్ధికి అవసరమైన నిధులను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పేదలు, మధ్య తరగతి ప్రజలు శుభ కార్యాలు చేసుకునేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. యాజమాన్య కమిటీ అధ్యక్షుడిగా తనను ఎన్నిక చేసేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే. సాబీర్‌పాషాకు కృతజ్ఞతలు తెలిపారు. ఉర్దుఘర్‌కు మంచి కీర్తి ప్రతిష్టలు తీసుకొస్తానని నయీంఖురేషి తెలిపారు.



ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటిని కలిసిన మువ్వా, రాయల

మంత్రులను కలిసిన కార్పొరేషన్ చైర్మన్లు

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 17: తెలంగాణ రాష్ట్ర విద్యా, సంక్షేమ మౌలిక సదుపాయాల చైర్మన్‌గా నియమితులైన డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసిన మువ్వా విజయ్‌బాబు తనకు నామినేటెడ్ పదవి అప్పగించటంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులను మువ్వా విజయ్‌బాబు సన్మానించారు.

తెలంగాణ రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు ఆదివారం హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసి వారిని సన్మానించారు. తనకు పదవి రావడానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

పగటి కలలు కంటున్న బీజేపీ

మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం

ఇల్లెందు, మార్చి 17: పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మాటలు గారడీలతో ప్రజలను మోసం చేసిందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నేరవేరచ్చలేదని రానున్న రోజుల్లో లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాయమని కేంద్ర మాజీ మంత్రి, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరామ్ నాయక్‌స్పష్టం చేశారు. ఆదివారం ఇల్లెందులో జరిగిన కాంగ్రెస్ ఎన్నికల సన్నాహక సమావేశంలో జరిగింది. ఈ సభలో బలరామ్ నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ చెందిన 20 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ఎంపీగా ప్రతినిధ్యం వహించిన మాలోత్ కవిత ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ప్రారంభోత్సవాలకు పిలిస్తే పట్టుచీరలు, కాస్మెటిక్స్ పెట్టాలని డిమాండ్ చేసిన కవిత కూడా కాంగ్రెస్‌లోకి చేరేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. అభివృద్ధి పథకాలపై విజన్ కలిగిన కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. బయ్యారం, పెద్దచెరువు అభివృద్ధి, తులారం ప్రాజెక్ట్, ఉక్కుకర్మాగారం, ఇల్లెందులో రైలు సౌకర్యం, భద్రాచలం బ్రిడ్జీ నిర్మాణం, ఐటీసీ విస్తరణ, కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో ఏర్పటితేనే సాధ్యమని స్పష్టం చేశారు. సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య కేంద్ర మంత్రి బలరామ్ నాయక్ ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి చేశారని, కాంగ్రెస్ పార్టీకి అనేక సేవలు చేశారని, ఓట్లు అడిగే హక్కు కాంగ్రెస్‌కే ఉందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ మోసపూరిత మాటలు నమ్మవద్దని కోరారు. సభలో అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన డీసీసీ అధ్యక్షుడు పోదెం వీరయ్యను ఎమ్మెల్యే కోరం కనకయ్య, బలరామ్‌నాయక్ తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సభలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావు, టీపీసీసీ కార్యదర్శి రామ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు యదలపల్లి అనసూర్య, కాంగ్రెస్ నాయకులు మధుకర్‌రెడ్డి, మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బలరాంనాయక్

మాదిగలకు 12శాతం రిజర్వేషన సాధనే లక్ష్యం

- పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటువేస్తే నష్టపోతాం
- మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి

అశ్వాపురం, మార్చి 17: తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ అందించేవరకు విశ్రమించేదే లేదని మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి అన్నారు. ఆదివారం అశ్వాపురంలో జరిగిన మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని మాదిగల మహాసమ్మేళన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ రామమందిరం నిర్మాణం చేపట్టి ఓట్లు అడిగిన విధంగానే ఎస్సీ వర్గీకరణ తర్వాతనే మాదిగలను ఓట్లు అడగాలన్నారు. వర్గీకరణ తమవల్లనే సాధ్యమని పేర్కొన్న కేంద్ర ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేయటం ఎందుకని ప్రశ్నించారు. కల్లబొల్లి కబుర్లు చెబుతున్న బీజేపీకి ఓటువేస్తే తెలంగాణ ప్రజలు నష్టపోతారన్నారు. తన జీవితం మాదిగలకే అంకితమని తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ తో సమానంగా ఉద్యమించిన తనపై వందల కేసులు నమోదయ్యాయన్నారు. మాదిగ సమాజాన్ని మేల్కొల్పేందుకు మరోమారు ఉద్యమ కార్యాచరణ చేపడుతున్నట్లు వివరించారు. త్వరలో సంగారెడ్డిలో మాదిగల రిజర్వేషన్ సాధనకు భారీ సభ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమ్మేళనంలో జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కొడారి ధీరన్, మాదిగ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మిరియాల నర్సింహరావు, నాయకులు సొంపల్లి తిరుపతి, వెంకటేశ్వర్లు, భానుప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిడమర్తి రవి

రేపు టీజీవోల మహిళా దినోత్సవం

కొత్తగూడెం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కొత్తగూడెం క్లబ్‌లో ఏర్పాటు చేసినట్లు టీజీవోఎస్ జిల్లా అధ్యక్షుడు సంఘం వెంకటపుల్లయ్య, కార్యదర్శి డాక్టర్ పి. విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహిళా, జిల్లా అధికారులకు సన్మానం చేయనున్నటుంల తెలిపారు. టీజీవోఎస్ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావుకు ఆత్మీయ సన్మానం ఉంటుందని తెలిపారు. జిల్లా గెజిటెడ్ అధికారులు, నాన్‌గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, నాల్గో తరగతి ఉద్యోగులు, డ్రైవర్స్ అసోసియేషన్ సంఘాల నాయకులు, ఉద్యోగులు హజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీడీపీవో కనకదుర్గ, టీజీవోఎస్ కార్యవర్గసభ్యులు తిరుమల్లేష్, చంద్రమోహన్, రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీజీవోఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకట పుల్లయ్య

లోక్‌సభ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు వీరే..

అసెంబ్లీ సెగ్మెంట్లకు నియమించిన ప్రభుత్వం

ఖమ్మం కలెక్టరేట్/కొత్తగూడెం(ఆంధ్రజ్యోతి), మార్చి 17: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని 10 సెగ్మెంట్ల పరిధిలో ఎన్నికల వేడి పెరుగుతోంది. ఎన్నికల కోసం ఇరు జిల్లాల అధికారయంత్రాంగం సన్నాహాలు చేస్తుంది. అయితే ఎక్కడైనా అభ్యర్థులు, ప్రత్యర్థులు రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే ఫిర్యాదు చేయడానికి ఎన్నికల సంఘం ఓటర్లకు, ప్రజలకు అనేక సౌకర్యాలు కల్పించింది. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గానికి ఖమ్మం జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించనున్నారు. మహబూబాబాద్ నియోజకవర్గానికి మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారు. అయితే ఈ నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు నోడల్ అధికారుల నియామకాన్ని పూర్తి చేశారు. ఆయా నియోజకవర్గాలకు 10మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను ఆదివారం నియమించారు. సి-విజిల్ యాప్, రిటర్నింగ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు ఎన్నికల పరిశీలకులను కూడా జిల్లాలో అందుబాటులో ఉంచింది.

నియోజకవర్గం	అధికారి పేరు	ప్రస్తుత హోదా	సెల్‌నెంబర్
ఖమ్మం	ఆదర్శ్ సురభి	కమిషనర్, ఖమ్మం కార్పొరేషన్	8143928581
పాలేరు	ఎం. రాజేశ్వరి	స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్, రైల్వేస్	7989393789
మధిర	జి. గణేష్	ఆర్డీవో, ఖమ్మం	9849906081
వైరా	బి. సత్యప్రసాద్	జిల్లా అదనపు కలెక్టర్	7702906076
సత్తుపల్లి	కె. శ్రీనివాస్	ఆర్డీవో కల్లూరు	8008342626
కొత్తగూడెం	డి. మధు	ఆర్డీవో కొత్తగూడెం	9392919715
అశ్వారావుపేట	డి. వేణుగోపాల్	అదనపు కలెక్టర్ కొత్తగూడెం	9392919700
పినపాక	ప్రతీక్‌జైన్	ఐటీడీఏ పీవో	9490957005
భద్రాచలం	దామోదర్‌రావు	ఆర్డీవో భద్రాచలం	9392919716
ఇల్లెందు	జే. కార్తీక్	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్	9866823688
అదనపు ఏఆర్వో	ఎస్. వినోద్	జడ్పీ సీఈవో ఖమ్మం	9440906933
అదనపు ఏఆర్వో	ఆర్. సన్యాసయ్య	డీఆర్డీవో ఖమ్మం	8008357744

నాణ్యత లేని మట్టితో సైడ్ బర్మ్‌లు

మణుగూరుటౌన్, మార్చి 17: మణుగూరు పట్టణంలోని టీడీపీ సెంటర్ నుంచి చినరావిగూడెం రహదారిలో బీటీ రోడ్డుకు నాణ్యత లేని మట్టితో సైడ్ బరమ్‌లను పోస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపుల నాణ్యమైన గ్రావెల్‌తో సైడ్ బరమ్‌లు వేయాల్సి ఉండగా మట్టితో సైడ్ బరమ్‌లను ఏర్పాటు చేస్తున్నారని వాపోతున్నారు. మట్టితో పోసిన సైడ్ బరమ్‌లు ఎక్కువ కాలంగా నిలవకపోగా వర్షాకాలంలో వరదలకు కొట్టుకు పోవడంతో జారు గుణాన్ని కలిగి ఉంటుందని పేర్కొంటున్నారు. తద్వారా వర్షాకాలంలో రోడ్డు దిగిన వాహనాలు జారి పొలాల్లోకి, రోడ్డు పక్కనే ఉన్న గోతుల్లో జారిపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిపై ఎక్కువగా అధిక లోడుతో ఇసుక లారీలు, ట్రాక్టర్లు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయని, ద్విచక్రవాహనాలు, ఆటోలు, కారులు ఎదురుగా లారీలు వస్తే రోడ్డు దిగాల్సి ఉంటుందంటున్నారు. సైడ్ బరమ్ మీటరు మేర నిర్మించాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టర్ తనకు నచ్చినట్లు నిర్మిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైన ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన గ్రావెల్‌తో బీటీ రోడ్డుకు ఇరువైపుల సైడ్ బరమ్‌లను నిర్మించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ సురేష్‌ను వివరణ కోరగా.. వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను వెంటనే పంపించి పరిశీలించాలని ఆదేశిస్తానని, మట్టి నాణ్యంగా లేకపోతే దానిని తొలగించి నాణ్యమైన గ్రావెల్‌తో నిబంధనలకు అనుగుణంగా సైడ్ బరమ్‌లు నిర్మించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మట్టితో నిర్మిస్తున్న రోడ్డు సైడ్ బరమ్‌లు



కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

దమ్మపేట, మార్చి 17: కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేయటంపై దమ్మపేట, మందలపల్లి చౌదరి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేసారు. ఆ సంఘం సమావేశం మందలపల్లిలోని కమ్మ సంఘం వెల్ఫేర్ అసోసియేషన్ భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు పోతినేని శ్రీరామవెంకట్రావు మాట్లాడుతు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేసి హామీ నిలబెట్టుకున్నారని హర్షం వ్యక్తం చేసారు. త్వరగతిన కార్పొరేషన్ ద్వారా కమ్మసామాజిక వర్గానికి సహాకారం అందించాలని విజ్ఞప్తి చేసారు. కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణలకు సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అధికారుల అలసత్వం.. నిర్మాణ పనుల్లో జాప్యం

ముందుకు సాగని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు

కొత్తగూడెం టౌన్, మార్చి 17: పారిశ్రామిక ప్రాంతమైన కొత్తగూడెం పట్టణంలో ప్రజల అవసరాల కోసం రూ.4 .50కోట్లతో నిర్మించి తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. అధికారుల అలసత్వం.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా రెండేళ్లుగా నిర్మాణ పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. ప్రజా ఆరోగ్యశాఖ, మున్సిపల్ ఇంజనీరింగ్‌శాఖ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులకు 2002 మార్చి 3వ తేదీన ఆ నాటి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు శంఖుస్థాపన చేశారు. స్టేట్ గ్రాంటుకు సంబంధించి రూ.4.50లక్షల వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టారు. కొత్తగూడెం పట్టణంలోని వివిధ ప్రాంతాలకు సంబంధించిన వ్యాపారాలు నిర్వహించుకునే విధంగా చర్యలు చేపట్టారు. రైతుబజారు ఉన్నప్పటికీ భవిష్యత్ అవసరాల నిమిత్తం రైతుబజారును కూల్చి వేసి రైతులకు, చిరు వ్యాపారులకు తాత్కాలిక షెడ్లను నిర్మించి వ్యాపారాలు సాగించే విధంగా ఏర్పాట్లు చేశారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పనులు పూర్తైతే ప్రయోజనం ఉంటుందని ఆశగా ఎదురుచూసిన వ్యాపారులకు నిరాశేఎదురవుతోంది. రెండేళ్లగా తాత్కాలిక షెడ్లలోనే వ్యాపారాలు సాగిస్తున్న ఇంటిగ్రేటెడ్ నిర్మాణ పనులు మాత్రం పూర్తి చేయకపోకుండ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిర్మాణ పనులు ముందుకు సాగని పనులు నెలకొనడంతో చిరు వ్యాపారులు ఎండాకాలంలో ఎండలకు, వర్ష కాలంలో వర్షాలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి నెలకొంటుంది. వీధి వ్యాపారులు సైతం ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లోనే వ్యాపారాలు సాగించే విధంగా అధికారులు ప్రణాళికలు రూపొందించినప్పటికీ పనులు మాత్రం ముందుకు సాగని పరిస్థితి ఉంది. అధికారులు సమన్వయం చేసుకుని నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్

కారు మబ్బుల కలవరం

ఆందోళనలో మిర్చి రైతులు.. కల్లాల్లో పంటపై బరకాలు



కొత్తపల్లి గోదావరి తీరంలో మిర్చిపై బరకాలు కప్పుతున్న దృశ్యం

చర్ల, మార్చి 17: వాతావరణంలో మార్పులు కారణంగా ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకున్నాయి. దీంతో చర్ల మండలంలోని 26 పంచాయితీల్లో మిర్చి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కురిస్తే తమ పరిస్తితి ఏమిటా అని ఉలిక్కిపాటుకు గురవుతున్నారు. ఆరబెట్టిన కాయలు, బస్తాలపై వర్షం కురిస్తే నష్టం జరగకుండా ప్రత్నామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలో ఈ ఏడాది అనేక మంది రైతులు వరి పంటలను తీసివేసి మిర్చిని సాగు చేశారు. నేడు పంటలు ఆఖరి కోతలో కనిపిస్తున్నాయి. అనేక మంది రైతులు మిర్చి కాయులు కోసి గోదావరి తీరం, మిర్చి కళ్లాల్లో ఆరబెట్టారు. కొంత మంది రైతులు బస్తాల్లో కాయలు తొక్కి నిల్వచేశారు. వర్షం కురిస్తే కాయలు మొత్తం తడిసిపోయే ప్రమాదం కనిపిస్తోంది. చెట్లపై ఉన్న కాయలు కూడా దెబ్బతినే పరిస్తితి ఉందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది మిర్చి పంట పెద్దగా ఆశాజనకంగా లేదు. పంటలపై వైరస్ దాడి అధికంగా కనిపిస్తోంది. సుమారు 90 శాతం సాగులో దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి వస్తే చాలా ఎక్కువ అన్న పరిస్థితిలో రైతులు కనిపిస్తున్నారు.



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలు

దమ్మపేట, మార్చి 17: గండుగులపల్లిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో బాగంగా పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. నియోజక వర్గపరిదిలోని దమ్మపేట, అశ్వారావుపేట, ములకలపల్లి, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాలకు చెందిన పలువురు గండుగులపల్లి వచ్చి ఎమ్మెల్యే జారే ఆదినారాయణనను కలిసి వినతి పత్రాలను అందజేసారు. పలువురి సమస్యలను అధికారులతో అక్కడిక్కడే ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేసారు. ఎక్కువమంది పోడు పట్టాలు, విద్యుత్ సమస్యలు గిరివికాసం పదకం క్రింది గిరిజనులకు బోర్లు మంజూరు, రేషన్ కార్డులు, ఇళ్ళు, భూవివాదాలు అంశాలపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్ళారు. ఆయా సమస్యలను పరిశీలిస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. అనంతరం నాగుపల్లి గ్రామంలో ఇస్లావత్ వసంతరావు నూతన గృహప్రవేశ వేడుకలు, మారగాని వెంకట్రావు కుమారుడి వివాహవేడుకలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న సాబీర్ పాషా

చుంచుపల్లి, మార్చి17: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రుద్రంపూర్ ఏరియాలోని ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లో చాలెంజర్స్ కప్- 2024 క్రికెట్ పోటీలకు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు స్నేహాభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి తోట రాజు, ఏఐటీయూసీ సెంట్రల్ కార్యదర్శి వీరస్వామి, 5 షాఫ్ట్ సెక్రటరీ ఉమయన్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ చేకూరి వెంకట్, సభ్యులు రాజేష్, హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌హెల్త్ సేవలు అభినందనీయం: కొత్వాల



మాట్లాడుతున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ టౌన్, మార్చి 17: పలు రుగ్మతలతో బాధ పడుతున్న వారికి వావ్ హెల్త్ యాప్ ద్వారా, వారికి ఆరోగ్య పరిరక్షణకు పాటించవల్సిన ఆరోగ్య సూత్రాలు, ఆహారపు అలవాట్లలో మార్పు జీవన విధానంపై సంపూర్ణ సలహాలు అందించి వారు చేస్తున్న సేవలు అభినందనీయమని డీసీఎంఎస్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం కేఎస్‌పీ రోడ్డులోని ఓ పంక్షన్ హాలులో వావ్‌హెల్త్ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బాడిశ ప్రవీణ్ కుమార్, బాడిశ శంకర్‌రావు, ఎస్‌కే. హుస్సేన్, పసుమర్తి రాము, చలువాది ప్రకాష్, ఎం. ఉషారాణి, బద్ది కిషోర్, కొండం వెంకన్న, పి. సత్యనారాయణ, కాపర్తి వెంకటాచారి, జి.భరత్, కె.కోటేశ్వరరావు, జి. శోభన్‌బాబు, రంగా, బుడగం రవి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషిచేయాలి: ఈవో



ఈవో రమాదేవిని సన్మానిస్తున్న దృశ్యం

భద్రాచలం, మార్చి 17: మహిళ సాధికారిత కోసం మహిళలు చేయవలసిన బాధ్యత ఎంతో ఉందని భద్రాచలం దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి అన్నారు. శ్రీశ్రీ కళావేదిక భద్రాద్రి జిల్లా కమిటీ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో ఆదివారం భద్రాచలంలో నిర్వహించిన మహిళ దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ముఖ్యంగా యువతులు ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో పోటీపడి ప్రతిభ చాటడం ఎంతో అభినందనీయమన్నారు. స్వయంశక్తిగా ఎదిగేందుకు ఎన్నో అవకాశాలను ప్రభుత్వాలు కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈవోను సన్మానించారు. పాల్‌రాజ్ ఇంజనీరింగు కాలేజీ చైర్మన్ వరలక్ష్మి, చిట్టె లలిత, పద్మావతి, కవి ప్రసాద్, కనకదుర్గ, లక్ష్మీనారాయణ, సుభద్ర, వార్డెన్ లక్ష్మి పాల్గొన్నారు.

మణుగూరులో ఫ్లెక్సీల తొలగింపు

మణుగూరు, మార్చి 17: పార్లమెంట్ ఎన్నికల కోడ్ మోగడంతో పినపాక నియోజకవర్గంలో రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. అయా మండలాల తహశిల్దార్‌లు ఎన్నికల నిబంధనల అమలుకు శ్రీకారం చుట్టారు. ఇందులో బాగంగా ఆదివారం నియోజకవర్గ ఏఆర్‌ఓ మణుగూరు తహశిల్దార్ రాఘవరెడ్డి పట్టణంలోని రాజకీయ నాయకులకు సంబంధించిన ఫెక్సీలను పంచాయతీ, మున్సిపాలిటీ సిబ్బంది తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో నియోజకవర్గంలోని మూడు మండలాలైన గుండాల, మోరంపల్లి బంజర, ఏడూళ్లబయ్యారం ప్రాంతాల్లో స్టాటిక్ సర్వేలెన్స్ టీం(ఎస్ఎస్‌టీ) చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లోని రాజకీయ నాయకుల విగ్రహాలు కనిపించకుండా ముసుగులు వేసే ప్రక్రియను చేపట్టారు.



ఫ్లెక్సీలు తొలగిస్తున్న దృశ్యం

ఉద్యమకారులకు పథకాలు అందించాలి

కొత్తగూడెం టౌన్, మార్చి 17: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం చేపట్టిన తొలిదశ ఉద్యమకారులను తెలంగాణ సమరయోధులుగా గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపచేయాలని 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు వి. శాంతిరామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మార్వాడి సత్రంలో ఉద్యమకారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అసలైన ఉద్యమకారులను గుర్తించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీవోను విడుదల చేసి ఉద్యమకారులకు సదుపాయాలను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు సత్యనారాయణరాజు, అనంతరెడ్డి, ఆవుల కృష్ణ, కృష్ణార్జున్‌రావు, కేశవరావు, గెర్షోమ్, రామారావు, బలరాం సింగ్, మల్లేష్, సత్తార్, వెంకటరామారావు, నాగభూషణం, భీమయ్య, కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు

ఇల్లందు, మార్చి 17: ఇల్లెందు ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు ఆదివారం హోరాహోరిగా జరిగాయి. అధ్యక్షుడిగా ప్రొద్దుటూరి నాగేశ్వరావు విజయం సాధించారు. గత 15 రోజులుగా పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు కోలాహలంగా నిండిపోయింది. సాధారణ ఎన్నికల మాదిరిగానే కరపత్రాలు, హామీలు గుప్పిస్తు ప్రచారాలు జరిగాయి. అధ్యక్షుడు ప్రొద్దుటూరి నాగేశ్వరావు తన ప్రత్యర్థి గౌరిశెట్టి కృష్ణపై 61 ఓట్ల మెజారిటితో గెలిచారు. మొత్తం 517 ఓట్లు పోల్‌కాగా, నాగేశ్వరావుకు 289 ఓట్లు, గౌరిశెట్టి కృష్ణకు 228 ఓట్లు వచ్చాయి. పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్య సభ్యులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. అనంతరం జరిగిన విజయోత్సవంలో ఆర్యవైశ్య ప్రముఖులు కండె రమేష్, పల్లెర్ల చంద్రశేఖర్, నాగేష్, నరేంద్రుల అను, బాలకృష్ణ, వాసు, బసవయ్య, విజయ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నాగేశ్వరావును ఆర్యవైశ్యులు ఘనంగా సన్మానించారు.

భద్రాద్రి రామయ్య మూలవరులకు ప్రత్యేక అభిషేకం

భద్రాచలం, మార్చి 17: భద్రాచలంలోని శ్రీ సీతా రామచంద్రస్వామి వారి మూలవరులకు ఆదివారం సందర్భంగా ఆర్జిత సేవలో భాగంగా ప్రత్యేక అభిషేకం, స్వర్ణ పుష్పార్చన, నిత్యకల్యాణం నిర్వహించారు.ఈ సేవల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామి వారి నిత్యకల్యాణ ప్రక్రియలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణ దారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనం గావించారు. ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మూనాళ్ల ముచ్చటేనా..

పగుళ్లుగా తేలిన ఎంఈవో భవనం.. పట్టించుకోని అధికారులు

కరకగూడెం, మార్చి 17: మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయ భవనం మున్నాళ్ల ముచ్చగానే మిగిలింది. పది కాలల పాటు ఉండల్సిన భవనం పగుళ్ల తేలి ఎప్పుడు కూలుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 2017 సంవత్సరంలో విద్యాశాఖ నిధుల నుంచి నూతనంగా నిర్మించిన ఎంఈవో భవనం కాంట్రాక్టర్ నాసి రకంగా నిర్మించడంతో గోడలు పూర్తిగా పగిలిపోయాయి. దాంతో ఎప్పుడు పడిపోతాయోనని ఎంఈవో కార్యాలయ సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



ఎంఈవో కార్యాలయ భవనం



గోడలు పగుళ్లు తేలిన దృశ్యం



ఇదీ దుస్థితి

బాధితులకు ఎమ్మెల్యే జారే పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట, మార్చి 17: ఇటీవల తిరుమలకుంట గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో పొట్టా రంగారావు ఇల్లు కాలిపోవటంతో నిరాశ్రులయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివారం రంగరావును పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. నష్టం వివరాలను తెలుసుకొని ప్రభుత్వ పరంగా అన్ని విధాల సహయ సహాకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అదే గ్రామంలో ఇటివలే జరిగిన ఆటో ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కొనకళ్ల రాజమ్మ, కొర్సా మహేశ్వరి, మొడియం అక్కమ్మ, మాడి బోడమ్మను పరామర్శించి ఆర్ధిక సహాయాన్ని అందించారు. అదే గ్రామంలో కోనా భాస్కరరావు మృతి చెందగా ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మామిళ్ళవారిగూడెంలో చెవల హరీష్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా అయనను ఎమ్మెల్యే పరామర్శించారు. నందిపాడు గ్రామంలో కృష్ణారావు కుమార్తె వివాహవేడుకకు హాజరై నూతన దంపతులను ఎమ్మెల్యే ఆశ్వీరదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిన్నంశెట్టి సత్యనారాయణ, ప్రమోద్, జుజ్జూరు దుర్గారావు, పల్లాల రామలక్ష్మయ్య, బొడ్డు సత్యనారాయణ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

పలు శుభకార్యాల్లో ఎమ్మెల్యే.

ములకలపల్లి: ములకలపల్లి మండల పరిధిలో నర్సాపురం పంచాయతీ తోగ్గూడెం గ్రామంలో ఆదివారం బొడ్రాయి ప్రతిష్ట పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హజరయ్యారు. అదేవిధంగా టేకులగుంపు గ్రామంలో పాండ్రా రమేష్ కుమార్తె ఓనీల పంక్షన్ వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. మాధారం పంచాయతీ రామాంజనేయపురంలో రాజరాజేశ్వరి దేవి ఆలయంలో బిక్ష కుమార్తె అన్నప్రసన్న కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట ములకలపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్, మాజీ జడ్పీటీసీ బత్తుల అంజీ, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

అటవీశాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా 'పొదెం'



భద్రాచలం, మార్చి 17: తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులుగా ఉన్న పొదెం వీరయ్యను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు నామినేటెడ్ పోస్టు ఇస్తుందని ఊహాగానాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ప్రభుత్వం ఆయన్ను నియమించింది. గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న వీరయ్యను అప్పటి ప్రభుత్వం అనేక ప్రలోభాలకు గురిచేసినా నమ్మిన కాంగ్రెస్ పార్టీని వీడకుండా పార్టీ పట్ల అంకితభావంతో ఉన్నారు. చైర్మన్‌గా ఆయ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

కార్పొరేషన్ పదవుల్లో మాలలకు అన్యాయం

చుంచుపల్లి, మార్చి 17: తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ పదవుల్లో మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఉమ్మడి జిల్లాల మాల మహానాడు అధ్యక్షుడు తుంపురు శివ ఆదివారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మాలలకు న్యాయం జరిగేలా మాల కార్పొరేషన్ చైర్మన్‌ని నియమించాలని డిమాండ్ చేశారు. మాలలను, మాలల ఉపకులాల త్యాగాలను విస్మరిస్తున్న పాలక ప్రభుత్వం తీరు మార్చుకోవాలని విమర్శించారు. అన్ని సామాజిక వర్గాలకు కార్పొరేషన్ ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని ఆగ్రహించారు. గత ప్రభుత్వం చాలా అన్యాయం చేసిందని, ఈ నూతన ప్రభుత్వం ఇదే విధంగా పరిపాలన కొనసాగిస్తే పార్లమెంట్ ఎలక్షన్‌లో తీవ్ర పరిణామాలుంటాయన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలను సాధించాలి

ఆళ్లపల్లి, మార్చి 17: ఆశయ సాధన కోసం బ్రిటీష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడి ఉరికంబాన్ని ఎక్కిన భగత్‌సింగ్ ఆశయాలను యువత పట్టుదలతో సాధించాలని పీవైఎల్ జిల్లా కార్యదర్శి పర్శిక రవి, జిల్లా నాయకులు అట్టికం శేఖర్ పిలుపునిచ్చారు. 93వ భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవుల వర్ధంతుల సభలను పురష్కరించుకుని ఆదివారం వారు మండల పరిధిలోని ఇప్పనపల్లిలో వర్ధంతి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్డీ నాయకులు బత్తిని సత్యం, పీవైఎల్ నాయకులు కృష్ణ పాల్గొన్నారు.

'పొదెం'కు పదవి పట్ల హర్షం

దుమ్ముగూడెం, మార్చి 17: మాజీ ఎంఎల్ఏ, డీసీసీ అధ్యక్షులు పొదెం వీరయ్యకు రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కడం పట్ల మండల కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం హర్షం వ్యక్తం చేశాయి. లక్ష్మీనగరం కేంద్రంలో కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. పదవి ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, తుమ్మలకు ధన్యవాదాలు తెలిపారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వీరమాచినేని వినీల్, నాయకులు బత్తుల శోభన్‌బాబు, పూజారి సూర్యచంద్రరావు, మద్ది రామిరెడ్డి, వేమనరెడ్డి, అప్పలరెడ్డి, కోటేశ్వరావు, ప్రవీణ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు. పొదెంకు పదవి దక్కడంపట్ల అంబేద్కర్ భారత రాజ్యాంగస్ఫూర్తి పురస్కారం-2022 అవార్డు గ్రహీత డా గద్దం ఆదాము అభినందించారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం

దుమ్ముగూడెం, మార్చి 17: కరాటేలో ప్రావీణ్యం ఆత్మరక్షణకు ఎంతో అవసరమని ఎస్ఐ కేశవరావు అన్నారు. ములకపాడు పీహెచ్‌సీ ఆవరణలో మూడు నెలల పాటు జరిగిన కరాటే శిక్షణ ముగింపు సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శిక్షణ పొందిన చిన్నారుల సాహస విన్యాసాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. కోచ్ బస్నీని పలువురు ఈ సందర్భంగా అభినందించారు. జెడ్పీటీసీ సీతమ్మ, కోచ్‌లు శేఖర్, శ్రీధర్, ముద్దరాజు, వీరభద్రం, కోటేశ్వరావు, పీఈటీ అన్నపూర్ణ, బీఆర్ఎస్ నాయకులు జానీపాషా, మాజీ సర్పంచులు సీతారామయ్య, చిన్నారావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ సృష్టికర్తను కించపర్చొద్దు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటరు, మార్చి 17: భారత రత్న అంబేద్కర్ విగ్రహ ప్రాంగణాన్ని పరిరక్షించాలని, భారత రాజ్యాంగ సృష్టికర్తను కించపర్చవద్దని భారత రత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ సెంటరులోని అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోస్టాఫీస్ సెంటరులోని అంబేద్కర్ విగ్రహ ప్రాంగణం చుట్టు వివిధ రకాల ఫ్లెక్సీలు కట్టి విగ్రహం కనపడకుండ చేస్తున్నారని, విగ్రహ ప్రాంగణం వద్ద చెత్తాచెదారం వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పక్కన గల ఖాళీ స్థలంలో త్వరలో బాబుజగ్జీవన్ రామ్ విగ్రహం కూడా నెలకొల్పనున్నామని తెలిపారు.

రూ.25వేలు ఆర్థిక సహాయం

పాల్వంచ టౌన్, మార్చి 17 : ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ చికిత్సకు స్థోమత లేని నిరుపేద వ్యాధి బాధితుడికి వైద్య సహాయంగా రూ.25వేల నగదును ఆర్థిక సహాయంగా చలువాది ట్రస్ట్, పాల్వంచ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో బాధితుడి కుటుంబసభ్యులకు ఆదివారం అందచేశారు. కొత్తగూడెం భజనమందిరం రోడ్డులో చిన్న టీస్టాల్ నడుపుకుంటు జీవించే చిల్లంచర్ల యాదగిరికి ఊపిరితిత్తులు పాడై కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆక్సిజన్ కూడా కావాల్సి రావడంతో ఆర్ఎస్ఎస్ వారి సహకారంతో గాలిలోనే ఆక్సిజన్ తయారు చేసి పేషెంట్‌కు ఆక్సిజన్ అందించే మిషన్ కూడా ఈ సందర్భంగా అందచేశారు.

పీఎసీఎస్ జిల్లా అధ్యక్షుడిగా నరసింహారావు

బూర్గంపాడు, మార్చి 17: పీఎసీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కమిటిని ఆదివారం ఎన్నుకున్నారు. బూర్గంపాడులోని సొసైటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా లంకా నరసింహారావు, ఉపాధ్యక్షుడిగా ప్రేమాచారి, ప్రధాన కార్యదర్శిగా సున్నం వెంకటేశ్వర్లు, గౌరవ సలహదారులుగా సయ్యద్ జిలాని, కోశాధికారిగా వెంకటరమణారెడ్డిలను ఎన్నుకున్నారు. కమిటిలో భాగంగా గౌరవ అధ్యక్షుడిగా ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్యను కొనసాగిస్తూ తీర్మానం చేశారు. ఈ సమావేశంలో పీఎసీఎస్ ఉద్యోగులు వెంకటేశ్వర్లు, సత్యనారయణ, తిరుపతిరెడ్డి, సైదులు, హరిప్రసాద్, రాంబాబు, సునీల్‌గౌడ్, సురేంద్రరెడ్డి, నాగేశ్వరరావు, సారయ్య, లక్ష్మీనారాయణ, విజయబాబు తదితరులు పాల్గొన్నారు.